క్లుప్తంగా

ఆర్థిక సాయం అందజేత



మృతుని పిల్లలకు ఆర్థిక సాయం అందిస్తున్న సుప్రియ

తాడిమర్రి: మండలంలోని గుడ్డంపల్లి గ్రామానికి చెందిన ఓ బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకట్రామిరెడ్డి సతీమణి సుప్రియ ఆర్థిక సాయం చేశారు. గుడ్డంపల్లి గ్రామానికి చెందిన కోడిమూర్తి ఓబన్న (42) ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతి చెందాడు. ఈ విషయాన్ని ఎంపీపీ పాటిల్ భువనేశ్వర్‌రెడ్డి ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. దీంతో మృతుని ఇద్దరు కుమార్తెలు, ఇద్దరు కుమారులను బుధవారం ధర్మవరంలోని ఎమ్మెల్యే నివాసానికి పిలిపించిన ఎమ్మెల్యే సతీమణి వారికి రూ.50 వేలు ఆర్థిక సాయం చేశారు. మనోధైర్యం కల్పించారు. కార్యక్రమంలో ఎంపీపీ పాటిల్ భువనేశ్వరెడ్డి, మాజీ సర్పంచ్ పాటిల్ ప్రకాష్‌రెడ్డి, కోడిమూర్తి ఆదినారాయణ ఉన్నారు.

కీచకుణ్ణి కఠినంగా శిక్షించాలి

కదిరి అర్బన్: విద్యార్థిని జీవితాన్ని నాశనం చేసిన కీచక ఉపాధ్యాయుడు రెడ్డి నాగయ్యను కఠినంగా శిక్షించాలని ఆర్డీఓ ఏఓ సుబ్బలక్ష్మీకి బీసీ ప్రచార కమిటీ రాష్ట్ర అధ్యక్షులు సంపంగి గోవర్ధన్ బుధవారం వినతిపత్రం సమర్పించారు. మైనర్‌ను తల్లిని చేసి సభ్యసమాజం తలదించుకునేలా చేశాడని చెప్పారు. బాధిత కుటుంబాన్ని ప్రభుత్వం ఆదుకోవాలని కోరారు. వినతిపత్రం సమర్పించిన వారిలో సైదాపురం రమణ, వనజమ్మ,లక్ష్మీదేవితో పాటు పలువురు పాల్గొన్నారు.

కర్ణాటక మద్యం పట్టివేత

కదిరి టౌన్: మున్సిపల్ పరిధిలోని నిజాం వలీ కాలనీలో బుధవారం కర్ణాటక మద్యం పట్టుకున్నట్లు సీఐ నారాయణ రెడ్డి తెలిపారు. కాలనీకి చెందిన దేరంగుల రత్నమ్మ మద్యాన్ని అమ్ముతుండగా దాడులు నిర్వహించి 96 టెట్రా ప్యాకెట్లు స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. నిందితురాలిని రిమాండ్‌కు పంపినట్లు సీఐ నారాయణరెడ్డి పేర్కొన్నారు. కర్ణాటక మద్యం విక్రయిస్తే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.

పంటకోత ప్రయోగాలు



పంట కోత ప్రయోగాలను పరిశీలిస్తున్న వ్యవసాయ శాఖ అధికారులు

బత్తలపల్లి: ఖరీఫ్ సీజన్‌లో వర్షాధార పంటగా సాగు చేసిన వేరుశనగ పంటలో పంటల దిగుబడి అంచనా కొరకు అధికారులు పంటకోత ప్రయోగాలు నిర్వహించారు. బుధవారం మండలంలోని పోట్లమర్రి గ్రామంలో కేశవరెడ్డి సాగు చేసిన వేరుశనగ పంటలో పంటకోత ప్రయోగాలను అధికారులు నిర్వహించారు. మండల వ్యసాయాధికారి ఓబిరెడ్డి, మండల గణాంక అధికారి డాక్టర్ కేఎల్ లక్ష్మీనరసింహాశర్మ, వీఎస్ఏ ముత్యాలు తదితరులు పంటకోత ప్రయోగాలను నిర్వహించారు. కేవలం 650 గ్రాములు దిగుబడి వచ్చినట్లు అధికారులు గుర్తించారు. వేరుశనగ పంట సాగు చేసినప్పటి నుంచి వర్షాలు కురవకపోవడంతో ఇప్పటికే పలువురు వేరుశనగ పంటను తొలగించారు.

మహిళకు పాముకాటు

ధర్మవరం రూరల్: మల్లాకాలువ గ్రామానికి చెందిన చంద్రమ్మ బుధవారం తన వ్యవసాయ పొలంలో పనులు చేసుకుంటుండగా పాము కాటుకు గురైంది. కుటుంబ సభ్యులు ధర్మవరం ప్రభుత్వాసుపత్రికి తరలించారు. అక్కడ వైద్యులు మెరుగైన చికిత్సలు అందించడంతో ప్రాణాపాయం తప్పిందని కుటుంబ సభ్యులు తెలిపారు.

సర్వసభ్య సమావేశం వాయిదా



ప్రజాప్రతినిధులకు సర్దిచెబుతున్న ఎంపీపీ

కదిరి అర్బన్: స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో మండల సర్వసభ్య సమావేశాన్ని ఎంపీటీసీలు, సర్పంచులు బాయ్‌కాట్ చేశారు. బుధవారం ఎంపీపీ తోట అమరనాథ్‌రెడ్డి అధ్యక్షతన సాధారణ సర్వసభ్య సమావేశం ఉదయం 11 గంటలకు ప్రారంభం కావాల్సి ఉంది. కొన్ని శాఖల అధికారులు హాజరుకాకపోవడంతో సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని ఎంపీటీసీలు, సర్పంచులు ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎంపీపీ మాట్లాడుతూ సమావేశానికి హాజరుకాని ఉద్యోగులపై కలెక్టర్, సంబంధిత శాఖల జిల్లా అధికారులకు ఫిర్యాదు చేయాలని ఆదేశించారు. ప్రజా సమస్యలు చర్చించేందుకు అధికారులు రాకపోతే ప్రజా ప్రతినిధులు సమస్యలు ఎవరితో చెప్పుకోవాలని ఆగ్రహం వ్యక్తంచేశారు. తదుపరి సమావేశం ఈ నెల 26కు వాయిదా వేస్తున్నట్లు ప్రకటించారు. సమావేశంలో జెడ్పీటీసీ రాధాబాయ్, ఎంపీడీఓ అంజనప్ప తదితరులున్నారు.

జగజ్జననీ పాహిమాం

నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా జరుగుతున్నాయి. కదిరి, పుట్టపర్తి, ధర్మవరం నియోజకవర్గాల్లోని ఆలయాల్లో బుధవారం వివిధ రూపాల్లో అమ్మవార్లు దర్శనమిచ్చారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని మొక్కులు చెల్లించుకున్నారు. తీర్థప్రసాదాలు అందుకున్నారు. నవరాత్రి ఉత్సవాలను పురస్కరించుకుని ఆలయాలను విద్యుద్దీపాలతో సుందరంగా అలంకరించారు. అమ్మవార్లకు విశేష పూజలు, అభిషేకాలు నిర్వహించారు.

– సాక్షిబృందం:



పుట్టపర్తిలో శాకాంబరిగా సత్తెమ్మ



పార్వతి దేవిగా వాసవిమాత



అన్నపూర్ణాదేవిగా చిత్రావతి దుర్గమ్మ



పూజలందుకున్న కొల్లాపురమ్మ



తనకల్లులో బాల త్రిపుర సుందరీదేవి



అన్నపూర్ణేశ్వరి దేవి అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు



బాలత్రిపుర సుందరి అలంకారంలో మరకత అమ్మవారు



కొత్తచెరువు: మహాలక్ష్మి రూపంలో పెద్దమ్మస్వామి



నల్లచెరువు: మహాలక్ష్మి రూపంలో వాసవీ కన్యకాపరమేశ్వరి

లోక కల్యాణార్థానికే సత్యసాయి అవతరణ



ప్రభాకర శర్మను సన్మానిస్తున్న రత్నాకర్ రాజు

ప్రశాంతి నిలయం: సమస్త మానవాళికి సత్యం, ధర్మం, శాంతి, ప్రేమ, అహింసలను బోధిస్తూ లోక కల్యాణార్థం అవతరించిన మహానుభావుడు సత్యసాయి అని ప్రముఖ పౌరాణిక శిరోమణి గార్లపాటి ప్రభాకర శర్మ పేర్కొన్నారు. బుధవారం సాయికుల్వంత్ సభా మందిరంలో ప్రశాంతి విద్వాన్ మహాసభ నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రపంచ నలుమూలలా ఉన్న మానవాళిని ఒక చోటుకు చేర్చి సమత,మమత, మానవత్వాలను బోధించిన మహనీయుడు సత్యసాయి అని కొనియాడారు. సత్యసాయి సెంట్రల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ రాజు, సభ్యుడు చక్రవర్తి గార్లపాటి ప్రభాకర్ శర్మను ఘనంగా సన్మానించారు.

హామీలన్నీ నెరవేర్చాం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి



హాజరైన వలంటీర్లు, గృహసారథులు, నాయకులు

- పేదవాడు మరింత బాగు పడాలంటే ఏపీకి జగనే మళ్లీ సీఎం కావాలి
- ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి

బత్తలపల్లి: ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఇచ్చిన హామీలన్నింటినీ అమలు చేసి ప్రజల ఆదరాభిమానాలను చూరగొన్నారని, అందుకే ఆంధ్రప్రదేశ్‌కి ఆయన మళ్లీ సీఎం కావాలని ఎమ్మెల్యే కేతిరెడ్డి వెంకటరామిరెడ్డి అన్నారు. బుధవారం బత్తలపల్లిలోని కదిరి రోడ్డులో ఉన్న ఆర్‌కేఆర్ కాంప్లెక్స్‌లో 'ఏపీకి జగనే ఎందుకు కావాలంటే'పై విస్తృతస్థాయి సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీని మళ్లీ అధికారంలోకి తీసుకొచ్చేందుకు ప్రతి నాయకుడు, కార్యకర్త కష్టపడి పని చేయాలన్నారు. ఏ ముఖ్యమంత్రి చేయని విధంగా అభివృద్ధి, సంక్షేమాన్ని సీఎం వైఎస్ జగన్ నాలుగున్నరేళ్లలో చేసి చూపించారన్నారు.అర్హతనే కొలమానంగా తీసుకుని నేరుగా గ్రామ వలంటీర్ల ద్వారా ప్రతి ఒక్కరికీ లబ్ధి చేకూర్చిన ఏకైక ప్రభుత్వం వైఎస్సార్‌సీపీనే అని స్పష్టం చేశారు. విప్లవాత్మక మార్పులకు శ్రీకారం చుట్టి పేదల గుండెల్లో గూడు కట్టుకున్న జగనన్నకు ప్రజలు మరోమారు అండగా నిలవాలన్నారు. ఓ అన్నగా, తమ్ముడిగా, మనవడిగా, మేనమామగా అన్ని వర్గాల ప్రజలను ఆదుకున్నట్లు తెలిపారు. పేద పిల్లలకు ఇంగ్లిష్ మీడియం చదువులు, ఇల్లు లేని వారికి స్థలంతో పాటు ఇంటి నిర్మాణం, డ్వాక్రా మహిళలకు నాలుగు దఫాల్లో రుణమాఫీ తదితర ఎన్నో పథకాల ద్వారా ఆదుకున్న జగనన్నను మళ్లీ ముఖ్యమంత్రిని చేసుకోవాలని పిలుపునిచ్చారు. కుటుంబానికి మంచి జరిగితేనే జగనన్నను ఆశీర్వదించాలని కోరారు. పార్టీ నాయకులు, కార్యకర్తలు అంతా సమన్వయంతో ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకెళ్లి భవిష్యత్‌లో మరిన్ని పథకాలను అందించాలంటే మరోమారు వైఎస్సార్‌సీపీనే గెలిపించుకోవాలని సూచించారు.

ప్రజలను మోసం చేసి..జైలులో ఉన్నాడు...

చంద్రబాబునాయుడును సీఎం చేస్తే రాష్ట్ర ప్రజలను మోసం చేశారని ఎమ్మెల్యే గుర్తు చేశారు.స్కిల్ డెవలప్‌మెంట్ పేరుతో నిరుద్యోగులను మోసం చేశారన్నారు. ఇప్పుడు జైలులో ఉండి నాటకాలు ఆడుతున్నారని ఎద్దేవా చేశారు. కోర్టులలో బాగా పేరు మోసిన లాయర్లు బాబు తరఫున వాదిస్తున్నారని, అయినా, ఎందుకు బయటకు తీసుకురాలేకపోతున్నారని ప్రశ్నించారు. ఎన్నికల సమయం దగ్గర పడుతోందని, ప్రతి ఒక్కరూ ప్రతి గడపకు వెళ్లి జగనన్న పథకాల ద్వారా వారికి ఎంత లబ్ధి చేకూరిందో వివరించాలన్నారు. అంతకు ముందు బత్తలపల్లిలో పార్టీ కార్యాలయాన్ని ఎమ్మెల్యే ప్రారంభించారు. కార్యక్రమంలో ఏపీ కురుబ కార్పొరేషన్ చైర్మన్ కోటి సూర్యప్రకాష్‌బాబు, ఎంపీపీ బగ్గిరి త్రివేణి, జెడ్పీటీసీ కోటి సుధ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ గొల్లపల్లి రామకృష్ణారెడ్డి, రైతు విభాగం రాష్ట్ర కార్యవర్గసభ్యులు కమతం ఈశ్వరయ్య, జిల్లా అధికార ప్రతినిధి గుర్రం శ్రీనివాసరెడ్డి, మండల కన్వీనర్ జయరామిరెడ్డి, సచివాలయ మండల కన్వీనర్ రాంభూపాల్‌రెడ్డి, మాజీ కన్వీనర్ బగ్గిరి బయపరెడ్డి, సర్పంచులు, ఎంపీటీసీ సభ్యులు, నాయకులు, కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

పరామర్శ

మండలంలోని గంటాపురం గ్రామానికి చెందిన వైఎస్సార్ సీపీ ఎస్సీ సెల్ నాయకుడు తప్పెట పెద్దన్న అనారోగ్యంతో బాధపడుతున్నట్లు తెలుసుకున్న ఎమ్మెల్యే కేతిరెడ్డి బుధవారం గ్రామానికి చేరుకుని పరామర్శించారు. త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. ఆయన వెంట సర్పంచు అక్కిం దామోదర్, ఎంపీటీసీ సభ్యులు తప్పెట ఆంజనేయులు, అప్పరాచెరువు ఈశ్వర్‌రెడ్డి, పోట్లమర్రి హనుమంతరెడ్డి, జాంపుల చంద్రమోహన్, తప్పెట పెద్ద కాటమయ్య, డీలర్ చిన్న కాటమయ్య తదితరులు ఉన్నారు.

వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి



వృద్ధురాలితో మాట్లాడుతున్న ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి

ఓడీచెరువు: వైఎస్సార్‌సీపీతోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమని ఎమ్మెల్యే దుద్దుకుంట శ్రీధర్‌రెడ్డి పేర్కొన్నారు. బుధవారం మామిళ్లకుంట్లపల్లి గ్రామ సచివాలయ పరిధిలోని జరికుంటపల్లి, తిప్పేపల్లి, ఎస్సీ కాలనీ, ఉంట్లవారిపల్లి, ఎస్టీకాలనీ గ్రామాల్లో గడప గడపకూ మన ప్రభుత్వం కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన ఎమ్మెల్యే ఆయా గ్రామాల్లోని ప్రతి గడపనూ సందర్శించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ మండలంలోని కొన్ని గ్రామాలకు 40 ఏళ్లుగా తారురోడ్డు లేక ఇబ్బందులు పడుతున్న సమయంలో తాము తారురోడ్డు వేశామని గుర్తు చేశారు. సీసీరోడ్లు, జలజీవన్ మిషన్ కింద ఇంటింటికీ ఉచితంగా నీటి కుళాయిని ఏర్పాటు చేశామన్నారు. అర్హులైన వారందరికీ పింఛన్లను ఇస్తున్నామన్నారు. గత ప్రభుత్వం ఒక్క ఇల్లు ఇచ్చిన పాపాన పోలేదని ఇప్పుడు అడిగిన వారందరికీ కుల, మత, పార్టీ, విభేదాల్లేకుండా జగనన్న ఇళ్లను మంజూరు చేస్తున్న ఘనత ఒక్క వైఎస్సార్‌సీపీకే దక్కుతుందన్నారు. వైఎస్సార్ జలకళ కింద అర్హులైన రైతులందరికీ ఉచితంగా బోరుబావులను వేయించామన్నారు. కార్యక్రమంలో మార్కెట్ యార్డ్ చైర్మన్ శ్రీనివాసరెడ్డి, జెడ్పీటీసీ దామోదర్ రెడ్డి, ఎంపీపీ పర్వీన్‌భాను, కన్వీనర్ రాజునాయుడు, టౌన్ కన్వీనర్ కోళ్ల క్రిష్టారెడ్డి, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షామీర్‌భాషా, మండల పార్టీ పరిశీలకుడు భాస్కర్‌రెడ్డి, జిల్లా డీలర్ల సంఘం అధ్యక్షుడు వెంకటరంగారెడ్డి, సర్పంచ్ రామచంద్రారెడ్డి, వెంకటరెడ్డి, ఇద్దేభాస్కర్‌రెడ్డి, సూర్యనారాయణ రెడ్డి, మహేశ్వర్‌రెడ్డి, రామాంజినేయులు, బాబ్‌జాన్, తదితరులు పాల్గొన్నారు.

దేశానికే ఆదర్శంగా గ్రామాల అభివృద్ధి



గంగసానివారిపల్లిలో రోడ్డు శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి

తనకల్లు: సీఎం వైఎస్ జగన్ దేశానికే ఆదర్శంగా రాష్ట్రంలో గ్రామాలను అభివృద్ధి చేస్తున్నారని ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి అన్నారు. మండల పరిధిలోని గంగసానివారిపల్లి, నారేవాండ్లపల్లికి నూతనంగా వేసిన సిమెంట్ రోడ్లను బుధవారం ఎమ్మెల్యే డాక్టర్ సిద్దారెడ్డి చేతుల మీదుగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గ్రామాలలో మౌలిక వసతులను కల్పించడానికి ప్రభుత్వం ప్రత్యేకంగా చొరవ చూపుతోందన్నారు. నియోజకవర్గంలో 135 గ్రామాలకు అప్రోచ్ రోడ్లను నిర్మించామన్నారు. తనకల్లు మండలంలో నాలుగున్నరేళ్లలో దాదాపు రూ. 40 కోట్లతో 30 గ్రామాలకు సిమెంటు, తారురోడ్లు వేయించామన్నారు. జాతీయ రహదారి నుంచి నారేవాండ్లపల్లి వరకు రూ. 31 లక్షలతో, జాతీయ రహదారి నుంచి గంగసానివారిపల్లి వరకు రూ. 40 లక్షలతో సిమెంటు రోడ్లు వేయించామని తెలిపారు.

అంకితభావంతో పనిచేయాలి

గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు అంకితభావంతో పనిచేసి ప్రభుత్వానికి మంచిపేరును తీసుకురావాలని ఎమ్మెల్యే సిద్దారెడ్డి సూచించారు. చీకటిమానిపల్లి, బొంతలపల్లి గ్రామ సచివాలయాలను బుధవారం అకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను, రిజిస్టర్లను పరిశీలించారు. గ్రామ సచివాలయాల్లో పనిచేస్తున్న ఉద్యోగులు ప్రజా సమస్యలు సత్వరం పరిష్కారం అయ్యేలా చర్యలు తీసుకోవాలని సూచించారు. విధులలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తే శాఖాపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం కింద మంజూరైన పనులను త్వరితగతిన పూర్తి చేయాలని ఆదేశించారు. కార్యక్రమంలో జెడ్పీటీసీ జక్కల జ్యోతి, పార్టీ సీఈసీ సభ్యుడు జక్కల ఆదిశేషు, మార్కెట్‌యార్డ్ చైర్మన్ ఈశ్వర్‌రెడ్డి, సర్పంచ్ శ్రీనివాసులు, నాయకులు శ్రీనివాసులనాయుడు, శ్రీహరిరెడ్డి, నాగభూషణరెడ్డి, నీలకంఠారెడ్డి, రామ్‌దేశాయ్, విజయ్, దొరస్వామి, శ్రీనివాసులు, ఆనంద్‌రెడ్డి, ఆది,రవి, రామమోహన్ రెడ్డి, సుధాకర్, తదితరులు పాల్గొన్నారు.

సమస్యల పరిష్కారానికి కృషి



మాట్లాడుతున్న కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి

ముదిగుబ్బ: సమస్యలను తెలుసుకొని వాటిని పరిష్కరించడానికి కృషి చేస్తామని ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటకృష్ణారెడ్డి అన్నారు. మండల పరిధిలోని జొన్నలకొత్తపల్లి, ముక్తాపురం, గాండ్లవారిపల్లి, సంకేపల్లి, మంగళమడక, రామస్వామి తండా, గుడ్డంపల్లి తండా సచివాలయ పరిధిలోని కార్యకర్తలు, గృహసారథులు, వలంటీర్లు, వైఎస్సార్‌సీపీ నాయకులు, కార్యకర్తలతో బుధవారం ఆయన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గ్రామాల్లో ఏవైనా సమస్యలు ఉంటే తన దృష్టికి తీసుకురావాలన్నారు. ప్రతి నాయకుడు, కార్యకర్త పార్టీ బలోపేతానికి కృషి చేయాలని ఆయన పిలుపునిచ్చారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ సీవీ నారాయణరెడ్డి, మండల ఇన్‌చార్జ్ ఇందుకూరి నారాయణరెడ్డి, సర్పంచులు నాగభూషణ, వెంగళ్‌రెడ్డి, మినీబాయి, ప్రసన్న వేణుగోపాల్, లక్ష్మిదేవి, పృద్వీనాయక్, చంద్రాయుడు, సచివాలయ మండల కన్వీనర్ భాస్కర్, నాయకులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న వైద్య శిబిరాలు



వృద్ధులకు కంటి అద్దాలు పంపిణీ చేస్తున్న దృశ్యం



జగనన్న ఆరోగ్య సురక్ష కిట్లు అందుకున్న రోగులు

చెన్నేకొత్తపల్లి: జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమంతో పేదలకు మేలు జరుగుతోందని ఎంపీపీ అంజలి, జెడ్పీటీసీ గోవింద రెడ్డి తెలిపారు. బుధవారం గంగినేపల్లిలో జరిగిన వైద్య శిబిరానికి స్పందన లభించింది. ఎన్ఎస్.గేట్ పీహెచ్‌సీ వైద్యుడు ఉదయ్, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు పాల్గొని ప్రజలకు వైద్య సేవలు అందించారు. రక్త పరీక్షలు బీపీ, షుగర్, ఈసీజీ, టీబీ, డెంగ్యూ, మలేరియా, టైఫాయిడ్, గర్భిణులకు వైద్య పరీక్షలు చేశారు. మందులను ఉచితంగా అందజేశారు. కార్యక్రమంలో ఈఓఆర్డీ అశోక్ నాయక్, సర్పంచ్‌లు, శాంతమ్మ, నవీన బాయి తదితరులు పాల్గొన్నారు.

235 మందికి వైద్య పరీక్షలు

తాడిమర్రి: మర్రిమాకులపల్లిలో బుధవారం ఏర్పాటు చేసిన వైద్య శిబిరంలో వైద్యాధికారులు 235 మందికి వైద్య పరీక్షలు చేసి మందులు పంపిణీ చేశారు. ఈఓపీఆర్డీ కామాక్షి అధ్యక్షతన కృష్ణమోహన్, జ్యోతిర్మయి, అస్మా, విజయ కుమారి తదితర వైద్యులు వైద్య శిబిరం ఏర్పాటు చేశారు. ఆరోగ్య సమస్యలు ఉన్న 38 మంది రోగులకు మెరుగైన వైద్యం, శస్త్ర చికిత్సల కోసం కార్పొరేట్ ఆసుపత్రులకు రెఫర్ చేశారు. ఆరోగ్య కార్యకర్తలు హర్షవర్ధన్‌రెడ్డి, జానకీరామ్, ఏఎన్ఎం లక్ష్మీకాంతమ్మ, ఎంఎల్‌హెచ్‌పీ రేణుక, వైఎస్సార్ సీపీ నాయకులు మేదిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

మంగళమడకలో..

ముదిగుబ్బ: మండల పరిధిలోని మంగళమడక గ్రామంలో బుధవారం 'జగనన్న ఆరోగ్య సురక్ష' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామంలో హెల్త్ క్యాంపు నిర్వహించారు. డాక్టర్లు నాగేంద్రనాయక్, లక్ష్మి నారాయణలు రోగులకు వైద్య చికిత్సలు అందించారు. కంటి చూపు సరిగా లేని వారికి కంటి అద్దాలను పంపిణీ చేశారు. కార్యక్రమాన్ని ఎమ్మెల్యే సోదరుడు కేతిరెడ్డి వెంకటక్రిష్ణారెడ్డి పరిశీలించారు. ఎంపీడీఓ విజలక్ష్మితో రోగులకు అందిస్తున్న సేవల గురించి ఆరా తీశారు. కార్యక్రమంలో సర్పంచ్ చంద్రాయుడు, సింగిల్ విండో అధ్యక్షులు బయపరెడ్డి, నాయకులు కిరణ్‌మోహన్‌రెడ్డి తదితరులున్నారు.

ఆరోగ్య సురక్షతో మెరుగైన వైద్యం

ఓడీచెరువు: ప్రభుత్వం జగనన్న ఆరోగ్య సురక్ష పేరుతో గ్రామాల్లో నిర్వహిస్తున్న వైద్యశిబిరాల్లో రోగులకు మెరుగైన వైద్యం అందుతోందని అధికారులు పేర్కొన్నారు. బుధవారం నల్లగుట్లపల్లిలో జగనన్న ఆరోగ్య సురక్ష కార్యక్రమాన్ని నిర్వహించారు. 250 మందికి ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించారు. 120 మందికి కంటి సంబంధిత పరీక్షలు చేసి 50 మందికి ఉచితంగా కంటి అద్దాలను పంపిణీ చేశారు. ఎంపీడీఓ వరలక్ష్మి, వైద్యాధికారి భానుప్రకాష్, నాయకులు చెన్నారెడ్డి, శ్రీనివాసరెడ్డి, తదితరులున్నారు.

ఆర్బీకే సిబ్బందికి శిక్షణ

ఎన్పీకుంట: మండల పరిధిలోని ధనియానిచెరువు రైతు భరోసా కేంద్రంలో బుధవారం ఆర్బీకే సిబ్బందికి ఏడీఏ సత్యనారాయణ శిక్షణా కార్యక్రమం నిర్వహించారు. రబీ సీజన్‌లో బోరుబావుల కింద వేరుశనగ, పొద్దుతిరుగుడు, మొక్కజొన్న పంటల సాగుకు అనుకూలంగా ఉంటాయని వివరించారు. 100 శాతం ఈ క్రాప్ నమోదుతో పాటు ఈకేవైసీ పూర్తి చేయడంపై హర్షం వ్యక్తం చేశారు. రబీ సీజన్‌లో రైతులు సాగు చేసే పంటలకు అనుగుణంగా విత్తనాలను రైతులకు అందించేలా ప్రణాళికలు సిద్ధం చేసుకోవాలని సూచించారు.కార్యక్రమంలో ఏఓ లోకేశ్వరరెడ్డి, ఏఈఓ శిరీషా, ఆర్బీకే సిబ్బంది పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్ ఆత్మహత్యాయత్నం

అమడగూరు: గుండువారిపల్లి గ్రామ పంచాయతీ ఫీల్డ్ అసిస్టెంట్ వెంకటశివ బుధవారం ఆత్మహత్యకు యత్నించాడు. గ్రామస్తులు తెలిపిన మేరకు.. వెంకటశివ బుధవారం విధులు ముగించుకుని సాయంత్రం ఇంటికి వచ్చాడు. ఇంటి పైకి వెళ్లి గది తలుపులు వేసుకుని ఉరి వేసుకున్నాడు. వెంటనే గుర్తించిన కుటుంబీకులు హుటాహుటిన అమడగూరు ఆస్పత్రికి తరలించారు. మెరుగైన చికిత్సల కోసం 108 వాహనంలో కదిరి ప్రభుత్వాస్పత్రికి తీసుకెళ్లారు. ఆత్మహత్యాయత్నానికి గల కారణాలు తెలియాల్సి ఉంది.

ఆత్మహత్యపై విచారణ

తనకల్లు: మండల పరిధిలోని మర్రాళ్లపల్లిలో అప్పుల బాధ తాళలేక ఆత్మహత్యకు పాల్పడిన రైతు సురేష్ మృతిపై తహసీల్దార్ శోభ సువర్ణమ్మ బుధవారం గ్రామంలో విచారణ చేశారు. పంటల సాగు కోసం ఎక్కడెక్కడ ఎంత మొత్తం అప్పు చేశాడని గ్రామస్థులను, కుటుంబ సభ్యులను అడిగి తెలుసుకున్నారు. పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు పంపనున్నట్లు తహసీల్దార్ తెలియజేశారు. ఏఓ శ్రీహరినాయక్, వీఆర్వోలు మహేష్, గంగాధర్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న 'సెబ్' దాడులు

పుట్టపర్తి టౌన్: జిల్లాలో 'సెబ్' అధికారుల దాడులు కొనసాగుతున్నాయి. బుధవారం హిందూపురం సింగిరెడ్డి క్రాస్ వద్ద 30 టెట్రాప్యాకెట్లు, ధర్మవరం బుడ్డారెడ్డిపల్లి వద్ద 20 కర్ణాటక టెట్రాపాకెట్లు స్వాధీనం చేసుకుని కేసులు నమోదు చేశారు. అలాగే కదిరి మండలం బత్తలపల్లి తాండాలో నారాసారా స్థావరాలపై దాడులు నిర్వహించి 100 లీటర్ల ఊటసారాను ధ్వంసం చేశారు.

సంక్షిప్త సమాచారం

నిందితుల అరెస్ట్

కదిరి టౌన్: పట్టణంలో రెండు రోజుల క్రితం అమృతవల్లి మహిళ డిగ్రీ కళాశాల ఆవరణలో రెండు వర్గాల మధ్య జరిగిన గొడవ విషయంలో పోలీసులు హత్యాయత్నం కేసు నమోదు చేశారు. దర్యాప్తు చేపట్టి నిందితులు జెట్టి ఉదయ్‌కుమార్, గణేష్, కార్తీక్‌ను బుధవారం అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్లు పట్టణ సీఐ నారాయణరెడ్డి తెలిపారు.

బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోండి

ఓడీచెరువు: ఏడీసీసీ బ్యాంకు సేవలను సద్వినియోగం చేసుకోవాలని నోడల్ అధికారి శ్రీనివాసరావు, బ్యాంకు మేనేజర్ అర్చన పేర్కొన్నారు. బుధవారం బ్యాంకులో రైతులు, ఖాతాదారులతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు.

దేవదాయ భూములను పరిరక్షించాలి

బత్తలపల్లి: మండలంలోని సర్వే నంబర్ 401లో 19 ఎకరాల 84 సెంట్ల దేవదాయశాఖకు చెందిన భూమి ఆక్రమణకు గురి కాకుండా పరిరక్షించాలని ధర్మవరం నియోజకవర్గ సీపీఐ కార్యదర్శి మధు డిమాండ్ చేశారు. బుధవారం స్థానిక ఏఐటీయూసీ కార్యాలయంలో రైతు సంఘం జిల్లా కార్యదర్శి జీవీ రమణ, రైతు సంఘం జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ కమతం కాటమయ్య, వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకులు కుళ్లాయప్ప, మండల కార్యదర్శి బండల వెంకటేష్‌తో కలిసి విలేకర్ల సమావేశం ఏర్పాటు చేశారు.

సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
ధర్మవరం డివిజన్
9912220727, 9912220726, 9010593486